క్లుప్తంగా

శివాలయంలో రుద్రహోమం



రాయికల్ లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పూజలు

రాయికల్: రాయికల్ పట్టణంలోని శివాలయంలో సోమవారం అర్చకులు సత్యంశర్మ, సతీశ్ శర్మ, సాయిశర్మ, సుధీర్, భరత్ ఆధ్వర్యంలో సోమవారం రుద్రహోమం వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హాజరు కాగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు.అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శివాలయం సేవకులు పాల్గొన్నారు.

కుర్మపల్లిలో పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

మండలంలోని కుర్మపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మతల్లి ఆలయంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ నిర్వాహకులు సన్మానించారు.

సమాచార హక్కు చట్టం నిర్వీర్యం



మాట్లాడుతున్న సంస్థ కన్వీనర్ స్వామిరెడ్డి

జగిత్యాలజోన్: సమాచార హక్కు చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీ కాంపెయిన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ స్వామిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన సంస్థ కార్యవర్గం సమావేశంలో మాట్లాడారు. సమాచార చట్టం కమిషనర్లు లేకపోవడంతో దరఖాస్తులన్నీ పెండింగ్‌లో ఉంటున్నాయన్నారు. ప్రభుత్వాలు ప్రజలకు సమాచారం తెలియకుండా చేస్తున్నాయని, ప్రభుత్వాల్లో పారదర్శకత లోపించిందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఎన్నం బాపురెడ్డి, సభ్యులు రాజేశ్వర్‌రావు, అమరేందర్, పోచమల్లు, శ్రీనివాస్, నరహరి, సరోజన, జనార్దన్ రెడ్డి, చైతన్య రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తరలింపును అరికట్టాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న గీతకార్మికులు

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి గ్రామ శివారులోని వాగులో నుంచి ఇసుక అక్రమ తరలింపును అరికట్టాలని గ్రామ గీతకార్మికులు సోమవారం తహసీల్దార్ వినోద్‌కు వినతిపత్రం ఇచ్చారు. వాగులో ఇష్టారీతిన ఇసుకను తవ్వి ఈత చెట్లను పడగొడుతున్నారని, దీంతో తాము ఉపాధి కోల్పోతున్నామని పేర్కొన్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి



సాయిబాబా సంస్మరణ సభలో నాయకులు

కోరుట్ల: పట్టణంలోని సి. ప్రభాకర్ స్మారక భవనంలో సోమవారం ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ నిర్వహించి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీ. ప్రభాకర్ స్మారక గ్రంథాలయ అధ్యక్షుడు చెన్నా విశ్వనాథం మాట్లాడుతూ సాయిబాబా ఎలాంటి తప్పు చేయకున్నా 10 ఏళ్ల జైలు జీవితం అనుభవించాడని, నిర్దోషిగా విడుదలై మృతి చెందటం బాధాకరమన్నారు. ఇది ప్రభుత్వ హత్యగానే భావించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చింతా భూమేశ్వర్, రాస భూమయ్య, తిరుపతి నాయక్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గోదావరిలో పెరిగిన ఉధృతి

ఇబ్రహీంపట్నం: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా నీటి ప్రవాహం రావడంతో ప్రాజెక్టు నుంచి గోదావరిలోకి 12 గేట్ల ద్వారా 53వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదలడంతో మండలంలోని కోమటికొండాపూర్, ఎర్దండి, మూలరాంపూర్ వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. గోదావరిలోకి పశువుల కాపరులు, చేపలు పట్టేందుకు మత్స్యకార్మికులు వెళ్లవద్దని అధికారులు తెలిపారు.

బీర్‌పూర్‌లో పీహెచ్‌సీ ఏర్పాటెప్పుడో?

- మండల ప్రజలకందని వైద్య సేవలు
- ఎనిమిదేళ్లుగా ఎదురుచూపు
- నాయకుల మధ్య సమన్వయ లోపంతో జాప్యం



మోతీనగర్ శివారుల్లో పీహెచ్‌సీ ఏర్పాటుకు సేకరించిన భూమి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం ఏర్పాటై ఎనిమిదేళ్లు గడుస్తున్నా.. మండల వాసులకు వైద్య సేవలు అందడం లేదు. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు (పీహెచ్‌సీ) ఏర్పాటు చేస్తే తమకు వైద్య సేవలు అందుతాయని స్థానికులు ఎదురు చూస్తున్నారు. ఎనిమిదేళ్లయినా ఇంతవరకు పీహెచ్‌సీ ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలనుంచి విమర్శలు వస్తున్నాయి.

మండలంలో 15 గ్రామాలు

బీర్‌పూర్ మండలంలో మొత్తం 15 గ్రామాలు ఉండగా, అన్ని గ్రామాల్లో అటవీప్రాంతాన్ని ఆనుకుని ఉన్నాయి. ప్రస్తుతం ఇక్కడ బీర్‌పూర్, తుంగూర్, కొల్వాయి, తాళ్లధర్మారం, మంగేళ గ్రామాల్లో సబ్ సెంటర్లు ఉండగా, తాళ్లధర్మారం, కొల్వాయి, తుంగూర్ గ్రామాల్లో పల్లె దవాఖానాలు ప్రజలకు వైద్య సేవలందిస్తున్నాయి. మండలంలో మొత్తం 10 మంది ఏఎన్‌ఎంలు పనిచేస్తున్నారు. 25 వేల నుంచి 30 వేల వరకు ఉన్న జనాభాకు ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ నిబంధన...కాని బీర్‌పూర్ జనాభా 30 వేలు దాటినా పీహెచ్‌సీ ఏర్పాటు జరగడం లేదు.

జిల్లాకు మూడు పీహెచ్‌సీలు మంజూరు

జిల్లాలో నూతనంగా ఏర్పడిన మండలాల్లో మూడు ఆరోగ్య కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది.దీనిలో బీర్‌పూర్, బుగ్గారం, ఎండపల్లి మండలాలు ఉన్నాయి. బీర్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు కు రెవెన్యూ అధికారులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని మోతీనగర్ శివారుల్లో ఎకరం స్థలాన్ని సేకరించి ప్రభుత్వానికి పంపించారు...అయినప్పటికీ ఎలాంటి పురోగతి లేదు.

కారణాలు అనేకం..

బీర్‌పూర్ మండల కేంద్రంలోని అనుసూరి గూడెం సమీపంలో ఆర్అండ్‌బీ ప్రధాన రోడ్డు వెంట పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని బీర్‌పూర్ గ్రామ ప్రజలు కోరుతున్నారు. మండలంలో అతి పెద్ద గ్రామం తుంగూర్ అని ఇక్కడ పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇది ఇలా ఉంటే కొల్వాయిమండలంలోని అన్ని గ్రామాలకు కేంద్రంగా ఉంటుందని ఇక్కడ ఏర్పాటు చేసి అన్ని గ్రామాలకు సౌకర్యంగా ఉంటుందని కొల్వాయి గ్రామస్తులు పేర్కొంటున్నారు. దీనితో అధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై ఇంకా తేల్చుకోలేకపోతున్నారు. దీనితో ప్రతిపాదనల వద్దే పీహెచ్‌సీ ఏర్పాటు ఆగిపోయిందని పలువురు భావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పీహెచ్‌సీ ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించాలని కోరుతున్నారు.

పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు జరగకపోవడంతో పూర్తిస్థాయిలో వైద్యసేవలు పొందడానికి సారంగాపూర్ పీహెచ్‌సీ, లేదా జగిత్యాలకు వెళ్లాల్సి వస్తుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటులో అధికారులు చర్యలను వేగవంతం చేయాలి.

– భైరవేణి సత్యనారాయణ, బీర్‌పూర్.

గిరిజన గ్రామాలు ఎక్కువగా ఉన్నాయి



మండలంలో గిరిజన గ్రామాలు ఎక్కువగా ఉన్నాయి. గిరిజన గ్రామాల ప్రజలతో పాటు, ఇతర గ్రామాలు కూడా అటవీప్రాంతాలకు ఆనుకుని ఉన్నాయి. ప్రజలకు సకాలంలో వైద్యసేవలు అందడానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు వెంటనే ఏర్పాటు చేయాలి.

– చుంచు అభిలాష్, నర్సింహులపల్లె

అందరి నిర్ణయం మేరకే ..



మండలంలోని పలు గ్రామాల్లో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు వస్తున్నప్పటికీ, ఏ గ్రామంలో ఏర్పా టు చేయాలన్నది ప్రజలు, నాయకులు తుదినిర్ణయం తీసుకుని ప్రభుత్వానికి నివేదిస్తే అక్కడ పీహెచ్‌సీ ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. – డాక్టర్ జయపాల్‌రెడ్డి, జిల్లా మాతాశిశు సంరక్షణాధికారి

పోలీస్ అమరుల త్యాగాలు మరువలేము



ధర్మపురిలో నివాళి అర్పిస్తున్న పోలీసులు

ధర్మపురి: విధి నిర్వాహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరుల త్యాగాలను మరువలేనివని సీఐ రాంనర్సింహారెడ్డి అన్నారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ వేడుకల్లో భాగంగా ధర్మపురి పోలీస్‌స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్ అమరుల శాంతి స్థూపం వద్ద సీఐ ఆధ్వర్యంలో పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవంను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న పోలీసుల సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. కార్యక్రమంలో సర్కిల్ పరిధిలోని ఎస్సైలు మహేశ్, శ్రీధర్‌రెడ్డి, సతీష్, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులకు నివాళి

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో సోమవారం పోలీసు అమరవీరులకు ఆయా పోలీస్‌స్టేషన్ల ఆవరణలో పోలీసులు ఘనంగా నివాళి అర్పించారు. సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన అమరుడైన కానిస్టేబుల్ విగ్రహానికి ఎస్సై దత్తాద్రి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై కుమారస్వామి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. కార్యక్రమాల్లో సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు సాయం చేయడం అందరి బాధ్యత

జగిత్యాలక్రైం: నిరుపేదలకు సాయం చేయడం ప్రతీ ఒక్కరి బాధ్యతగా చూడాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ అన్నారు. సోమవారం సాయంత్రం జగిత్యాల పట్టణంలోని వాల్మీకి ఆవాసంలోని విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలైన చిన్నారులకు విద్యతో పాటు, అన్ని రకాల సాయాలను సమాజంలోని ప్రతీ ఒక్కరు తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వేణుగోపాల్, వాల్మీకి ఆవాసం నిర్వాహకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడలకు కోరుట్ల విద్యార్థి

కోరుట్ల: పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థి జె.షణ్ముఖ తేజ అండర్ 14 విభాగం లాంగ్ జంప్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యాడు. శనివారం జగిత్యాలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో షణ్ముఖ తేజ అండర్ – 14 విభాగం లాంగ్ జంప్‌లో మొదటి స్థానంలో నిలిచి ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా సోమవారం షణ్ముఖ తేజను పాఠశాల వ్యవస్థాపకుడు తుమ్మనపల్లి సత్యనారాయణ, కరస్పాండెంట్ తుమ్మనపెల్లి మనోజ్‌కుమార్, ప్రిన్సిపాల్ గంగాధర్, పీఈటీలు గౌతమి, అనసూర్య, నరహరి అభినందించారు.

విద్యార్థికి అభినందన

కథలాపూర్: మండలకేంద్రంలోని మాస్ట్రో హైస్కూల్‌లో పదోతరగతి చదువుతున్న చెదలు వరుణ్ అనే విద్యార్థి షార్ట్‌పుట్ పోటీల్లో జిల్లాస్థాయి ప్రథమ స్థానం దక్కించుకున్నట్లు ప్రిన్సిపాల్ ఆకుల రంజిత్ సోమవారం తెలిపారు. ఎస్జీఎఫ్ క్రీడలు జగిత్యాలలో నిర్వహించగా, అండర్–17 విభాగంలో షార్ట్‌పుట్‌లో ప్రథమ స్థానం దక్కించుకున్నారు. వరుణ్‌ను పాఠశాల కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, ప్రిన్సిపాల్ రంజిత్, ఉపాధ్యాయులు అభినందించారు.

జర్నలిస్టుపై దాడిని నిరసిస్తూ రాస్తారోకో

మెట్‌పల్లి: భద్రాది కొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందులో జర్నలిస్టు సుదర్శన్‌పై దాడికి పాల్పడిన వారందరిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఎస్సారెస్పీ వంతెన వద్ద సోమవారం జర్నలిస్టులు రాస్తారోకో చేశారు. నిందితులందరినీ అరెస్ట్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆగ సురేశ్,సంజీవ్, దాసం కిషన్, మాసుల ప్రవీణ్, మహమ్మద్ అజీమ్, మక్సూద్ పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఓటర్‌గా నమోదు చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ఓటు వేసేందుకు ఓటర్‌గా గ్రాడ్యుయేట్‌లు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ప్రసాద్ సోమవారం తెలిపారు. నవంబర్ 6, 2024 వరకు డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఓటర్‌గా నమోదు చేసుకొవచ్చునని తెలిపారు. వచ్చే నెల 6 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ కాకుండా నియామకాలు చేపట్టొద్దు



మాట్లాడుతున్న ఎమ్మార్పీ ఎస్ నాయకులు

మేడిపల్లి: ఎస్సీ వర్గీకరణ చేయకుండా ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెట్‌పెల్లి లక్ష్మణ్, జిల్లా అధికార ప్రతినిధి కాశ వత్తుల లక్ష్మిరాజం అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం మండల అధ్యక్షుడు దప్పు ప్రేమ్ సాగర్ మాదిగతో కలిసి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలుపై సీఎం రేవంత్ రెడ్డి వైఖరికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిరసనగా జగిత్యాల జిల్లా కేంద్రంలో అక్టోబర్ 27, న నిర్వహించ తలపెట్టిన మాదిగల ధర్మయుద్ధ సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆరూరి లతీష్ మాదిగ, చిట్యాల గౌతం, చిట్యాల రాజ్ కుమార్, నాగేందర్ దప్పు వినయ్, బాపురపు వసంత్ కుమార్, మాదిగ వేములవాడ ఎంఎస్ఎఫ్, నియోజ కవర్గ ఇన్చార్జి మారంపల్లి వినోద్ మాదిగ, మెట్పల్లి మండల అధ్యక్షుడు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గొల్లపల్లి: మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన పాదం వెంకటేశ్ తల్లి మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సోమారం పరామర్శించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ జలేందర్, నాయకులు కాంపెల్లి హన్మండ్లు, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి పాదం తిరుపతి, లక్ష్మణ్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ బూత్‌కు 200 మంది సభ్యత్వం నమోదు చేస్తాం

ఇబ్రహీంపట్నం: మండలంలోని గ్రామాల్లో ప్రతి బూత్‌కు 200మందిని బీజేపీని సభ్యత్వ నమోదును చేయిస్తామని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బాయి లింగారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని డబ్బా, ఎర్రాపూర్ గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జి ముద్దం నరేశ్, బూత్ అధ్యక్షులు పుప్పాల మహేశ్, బైన మల్లేశ్, కమటం దేవన్న, గంగుల మనోజ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మించాలి

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్‌లో వెంకటేశ్వరస్వామి ఆలయం వెనుక ఉన్న పంట పొలాలకు గ్రామం మురికినీరు అంత చేరి పంటలు పండించుకోలేకపొతున్నామని, డ్రెయినేజీని నిర్మించి నీళ్లు మళ్లించాలని రైతులు సోమవారం ప్రజావాణిలో తహసీల్దార్ ప్రసాద్‌కు విన్నవించారు. జూన్ 26న దరఖాస్తు ఇచ్చినప్పటికీ అధికారులు స్పందించలేదని, డ్రెయినేజీ నిర్మాణానికి ఆర్అండ్‌బీ నిధులు రూ.70 లక్షలు మంజూరు కాగా, కాంట్రాక్టర్ పనులు ప్రారంభించగా కొంతమంది అడ్డుకున్నారు. వెంటనే అధికారులు చొరవ డ్రెయినేజీ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు చిన్న నర్సయ్య, రాచకొండ బుచ్చవ్వ, ఎలేటి అశోక్‌రెడ్డి, విజయ, తదితరులు పాల్గొన్నారు.

మీ సేవా కేంద్రాలపై చర్యలు తీసుకోవాలి

మల్యాల: మీసేవా కేంద్రాల్లో అధిక ధరలు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ మల్యాల మండల అధ్యక్షుడు నేరెళ్ల సతీశ్ రెడ్డి, మల్యాల పట్టణ అధ్యక్షుడు కటుకం వినయ్ మండల తహసీల్దార్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. మండలంలోని మీ సేవా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి, అధిక ఫీజులు వసూలు చేస్తున్న వారిని గుర్తించి, చర్యలు తీసుకోవాలని కోరారు. మీ సేవా కేంద్రాల్లో ధరల పట్టికలు ఏర్పాటు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పాఠశాలకు ప్రొజెక్టర్ వితరణ

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్ జెడ్పీ హైస్కూల్‌లో చదివిన 2015–16 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాలకు ఉపయోగపడే వస్తువులను సోమవారం అందించారు. ప్రొజెక్టర్, స్క్రీన్, ఎలక్ట్రికల్ బెల్‌ను పాఠశాలకు వితరణ ఇచ్చారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

మూటపల్లిలో ఇసుక టెండర్

రాయికల్: మండలంలోని మూటపల్లి వాగులోంచి అక్రమంగా ఇసుక తరలించేందుకు రూ.4 లక్షలకు టెండర్ నిర్వహించినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గతంలో అక్రమ ఇసుక రవాణా నిర్మూలనకు కలెక్టర్ పకడ్బందీగా చర్యలు చేపట్టగా కొన్ని రోజుల వరకు నిలిపివేశారు. గత కొద్దిరోజులుగా అక్రమార్కులు అధికారుల కళ్లుకప్పి రాత్రుల పూట అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



2000-01 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

సారంగాపూర్: మండలంలోని పెంబట్ల–కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో 2000–2001 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. తమతో చదివిన రంగోపేట గ్రామానికి చెందిన రామడుగు రవి ఇటీవల ధర్మపురి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులు కాగా, ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో రవి, వెంకటేష్, శేఖర్, రాజుకుమార్, సతీష్, తిరుపతి, సంపత్, ప్రభాకర్, మహేందర్, పద్మ, సంధ్య, సుజాత, అరుణ, శ్రీలత, శైలజ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

పోలీస్‌స్టేషన్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సాయంత్రం టీఆర్‌నగర్ గ్రామానికి చెందిన అజ్మత్ అనే యువకుడు డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పోలీసులు అడ్డుకున్నారు. టీఆర్‌నగర్‌కు చెందిన అజ్మత్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం కరీంనగర్‌కు చెందిన యువతి తన వద్ద డబ్బులు తీసుకుని మోసం చేశాడని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో పోలీసులు కేసు పెట్టారనే భయంతో డీజిల్ తీసుకుని వచ్చి పోలీస్‌స్టేషన్‌లో డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, అక్కడే ఉన్న ఎస్సై మన్మథరావు, సిబ్బంది అడ్డుకుని నచ్చజెప్పారు. అనంతరం అజ్మత్‌ను వారి కుటుంబసభ్యులకు అప్పగించారు.

దొంగ అరెస్ట్

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌తో పాటు, రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పలు దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న వడ్లూరి నాగరాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ వేణుగోపాల్ తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన వడ్లూరి నాగరాజు జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌తో పాటు, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో చోరీ చేసి ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. కరీంనగర్‌రోడ్‌లోని చిన్న కెనాల్ వద్ద నిందితున్ని అరెస్ట్‌చేసి, అతని వద్ద నుంచి రూ.3500 నగదుతో పాటు, వివిధ ఆలయాల్లో దొంగతనం చేసిన రాగి చెంబులు, శఠగోపం, ఇత్తడి గంట, ఇత్తడి హారతి ప్లేట్లు, మంగళహారతి ప్లేట్లు, అమ్మవారి చీర, త్రిశూలం చిన్నది, అమ్మవారి చెరుకుగడశూలం, తువ్వాలు, రెడీమేడ్ హారాలు, అమ్మవారి వడ్డాణాలు మొత్తం సుమారు రూ.20 వేల విలువ గల ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నిందితుడి అరెస్టు

కథలాపూర్: మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన నేతుల మల్లేశం హత్యకు కారణమైన మెట్‌పల్లికి చెందిన నిందితుడు పడ గంగమల్లయ్యను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఈ నెల 1న నేతుల మల్లేశం హత్యకు గురైన విషయం తెలిసిందే. హత్యకు కారణమైన మొదటి వ్యక్తి భూపతి గంగారాంను ఈ నెల 5న అరెస్టు చేశామని, హత్యకు సహకరించిన గంగమల్లయ్యను సోమవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ మృతి

సారంగాపూర్: ఎన్పీడీసీఎల్‌లో పనిచేస్తున్న సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ రామేశ్వర్‌రెడ్డి సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. సారంగాపూర్ మండలంలో సుదీర్ఘకాలం పనిచేసిన రామేశ్వర్‌రెడ్డి ఇటీవలే బదిలీపై మల్యాల మండలం వెళ్లగా అక్కడి ఇంకా విధుల్లో చేరకముందే ఆరోగ్య సమస్యలు ఏర్పడి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలని ఆందోళన



రాస్తారోకో చేస్తున్న కుటుంబ సభ్యులు

మెట్‌పల్లి: మల్లాపూర్ మండలంలోని ఓబులాపూర్‌లో సాయిలును హత్య చేసిన కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు సోమవారం పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ ఒత్తిళ్లతో ఈ హత్య కేసులో కొందరిని తప్పించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి హత్యతో సంబంధమున్న నిందితులందరినీ అరెస్ట్ చేసి కఠినంగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ట్రాఫిక్ స్తంభించడంతో విషయం తెలుసుకున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి అక్కడకు చేరుకుని వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

సంక్షిప్త వార్తలు

రైతు సమస్యలపై బీఆర్‌ఎస్‌కు చిత్తశుద్ధి లేదు

మెట్‌పల్లి: రైతు సమస్యలపై బీఆర్‌ఎస్‌కు ఏమాత్రం చిత్తశుద్ధి లేదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. రుణమాఫీ విషయంలో బీఆర్‌ఎస్ రైతులను మోసం చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో అమలు చేసిందన్నారు. దీనిని ఓర్వలేక బీఆర్‌ఎస్ నాయకులు రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆదివారం బీఆర్‌ఎస్ చేపట్టిన ధర్నాలో రైతులు పాల్గొనలేదని, ఆ పార్టీ నాయకులు ఇప్పటికైనా తమ వైఖరి మార్చుకోవాలని ఆయన సూచించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మల్లాపూర్: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎంచిరాల చిన్నారెడ్డి అన్నారు. సోమవారం మల్లాపూర్‌లో పూండ్ర శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల వరకు రుణమాఫీ జరుగుతుందని, విపక్షాల దుష్ప్రచారాన్ని, అపోహలు నమ్మొద్దని సూచించారు. సమావేశంలో నాయకులు అంతడుపుల నర్సయ్య, ప్యాక్స్ మాజీ చైర్మన్ క్యాతం మల్లారెడ్డి, డైరెక్టర్లు పూండ్ర లక్ష్మారెడ్డి, నల్ల రాజరెడ్డి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ నూతిపెల్లి రాజం, నాయకులు పాల్గొన్నారు.

కరువుభత్యం విడుదల చేయాలి

జగిత్యాల:ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు కరువు భత్యం విడుదల చేయాలని టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తుంగూరి సురేశ్ అన్నారు. సోమవారం ఉపాధ్యాయ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి డీఏలు విడుదల చేయాలని, ఉపాధ్యాయ పెండింగ్ బిల్లులన్నింటిని త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. ప్రధాన కార్యదర్శి గుర్రం శ్రీనివాస్‌గౌడ్, నాయిని విజయనందరావు, ఓదెల శేఖర్, గుండ శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కోరుట్ల రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామని ఐకేపీ ఏపీఎం శంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

మల్యాల మండలంలో..

మల్యాల: మండలంలోని మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు మద్దుట్ల, రామన్నపేట, ముత్యంపేట, తాటిపల్లిలో గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించనున్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా అంజయ్య

పెగడపల్లి: ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా మోదుంపల్లి అంజయ్య నియామకమయ్యారు. సోమవారం మండల కేంద్రంలో మ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం ఆధ్వర్యంలో కమిటీని నియమించారు. కో కన్వీనర్లుగా కొల్లూరి రమేశ్, ఆరెల్లి రాకేశ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 27న జగిత్యాలలో మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే ఎమ్మార్పీఎస్ బహిరంగ సభకు మండలం నుంచి అధిక సంఖ్యలో మాదిగలు తరలిరావాలని కోరారు.

వెల్లుల్లలో ఉచిత కంటి వైద్య శిబిరం

మెట్‌పల్లిరూరల్: మండలంలోని వెల్లులలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సోమవారం గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించగా, 200 మంది వైద్యశిబిరానికి హాజరయ్యారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పాపయ్య

జగిత్యాల: మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా గొల్లపల్లి మండలం చందోలి గ్రామానికి చెందిన సాయిని పాపయ్యను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే జగిత్యాలకు చెందిన శ్రీపతి రమేశ్‌ను రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా, పెంబట్లకు చెందిన గుర్నాథం మల్లారెడ్డి రాష్ట్ర రైతు విభాగం సభ్యుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరి నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

తపస్ మండల అధ్యక్షుడిగా రజినీకాంత్

రాయికల్: తపస్ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడిగా కొండూరి రజినీకాంత్, ప్రధాన కార్యదర్శిగా రాచర్ల శ్రీనివాస్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తపస్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య, ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడు చెరుకు మహేశ్వరశర్మ తెలిపారు.

ఎంఈవోకు సన్మానం

వెల్గటూర్: 30 ఏళ్ల క్రితం స్పెషల్ టీచర్‌గా మొదలైన ప్రయాణంలో ఎస్‌జీటీగా మారి, గతేడాది సెప్టెంబర్‌లో హెచ్‌ఎంగా పదోన్నతి పొంది ఏడాదిలోగా ఎంఈవో స్థాయికి ఎదిగిన ప్రయాణం అందరికీ ఆదర్శ ప్రాయమని డీటీఎఫ్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు నీలం సంపత్ అన్నారు. సోమవారం ఎంఈవోను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సురేంద్రస్వామి, సత్తయ్య, గంగన్న, సాగర్, మహేశ్, గంగరాజం, ముజాహిద్ అలీ, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగం సాధించిన యువతికి గ్రామస్తుల సన్మానం

మల్లాపూర్: మండలంలోని రత్నాపూర్‌కు చెందిన సాదుల ప్రవళిక ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించి ఉపాధ్యాయురాలుగా ఎంపిక కాగా, సోమవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో ప్రవళికను గ్రామస్తులతో కలిసి సామాజిక కార్యకర్త రుద్ర రాంప్రసాద్ సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శకుంతలదేవి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.